సాక్షి వరంగల్

సోమవారం | 2 | జూన్ | 2025



అధిక సాంద్రత సాగు.. లాభాలు బాగు

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణం తెలిపారు.

- 8లో



పశువుల ఎరువుతో భూసారం

దుక్కులు దున్నడానికి ముందు పంట భూముల్లో పశువుల ఎరువు వేసి దున్నితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం $38^0/27^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నిబంధనలు తూచ్

ఔషధ నిల్వల్లో అధికారుల ఇష్టారాజ్యం

- ఇరుకు గదుల్లో వందలాది రకాల ఔషధాలు
- కానరాని రిఫ్రిజిరేటర్లు.. ఏసీలు
- మౌలిక వసతుల కొరత..



ఇరుకు గదిలో ఏర్పాటు చేసిన ఔషధ నిల్వలు

ఎంజీఎం: రోగులకు మెరుగైన మందులు అందించేందుకు ప్రతీ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ (సీఎంఎస్) నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా పేర్కొంటున్న వరంగల్ మెడికల్ హబ్‌గా మారుతున్న క్రమంలో రెండు ఇరుకైన గదుల్లో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌ను మౌలిక వసతుల లేని ప్రదేశంలో ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరంగల్ జిల్లా కేంద్రంలో 1,500 పడకల ఎంజీఎం ఆస్పత్రితో పాటు 100 పడకల సీకేఎం ఆస్పత్రి, 100 పడకల నేత్ర వైద్యశాలకు వరంగల్ సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచే మందులు సరఫరా అవుతాయి. అంతేకాకుండా వరంగల్ జిల్లా కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు సైతం ఈ సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచే ప్రభుత్వం అందించే మందులు సరఫరా చేయాల్సి ఉంది. నిత్యం వేలాది మంది రోగులకు పంపిణీ చేసే సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నిర్వహణ చూస్తే పేదలపై అధికారుల ప్రేమ ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది.

ఉర్సులో ఇరుకు గదుల్లో..

వరంగల్ జిల్లా కేంద్రంలోని సీకేఎం, ఉర్సు ప్రసూతి ఆస్పత్రిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సీఎంఎస్(సెంట్రల్ డ్రగ్ స్టోర్)ను ఇరుకైన రెండు గదుల్లో ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా పరిధిలో ఎంజీఎం, ప్రాంతీయ కంటి దవాఖాన, సీకేఎం ప్రసూతితో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నర్సంపేట, వర్ధన్నపేట కమ్యూనిటీ ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్లు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు, సర్జికల్స్ ఈ సీఎంఎస్ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. ఇంత ప్రాముఖ్యం ఉన్న మందుల గిడ్డంగికి ముందస్తుగా క్షేత్రస్థాయిలో ప్రణాళిక లేకుండా అప్పటికప్పుడు రెండు చిన్న గదుల్లో ఏర్పాటు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. అవసరమైన విశాలమైన భవనాలను సమకూర్చాల్సింది. ఔషధాలు పాడవకుండా అవసరమైన రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషన్ రూములు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మౌలిక సౌకర్యాలు లేకుండా బూత్ బంగ్లాను తలపించే విధంగా స్టోర్ భవనం ఉండడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

సీఎంఎస్‌ను ఎంజీఎంలోకి మార్చాలి

తాత్కాలికంగా సీఎంఎస్‌ను ఎంజీఎంలో ఖాళీగా ఉన్న ఏదైనా బ్లాక్‌లోకి మార్చితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సీఎంఎస్ మందులలో 75 శాతం మందులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రే వినియోగించుకుంటోందని బడ్జెట్ గణాంకాల ద్వారా తెలుస్తోంది. అలాంటప్పుడు ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్దదిక్కుగా, రోగులకు బాసటగా నిలుస్తున్న ఎంజీఎంలో తాత్కాలిక సీఎంఎస్ ఏర్పాటు చేస్తే అత్యవసర సమయాల్లో మందుల సరఫరా కూడా సౌకర్యంగా ఉంటుందని కొందరు వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోకి మరికొద్ది నెలల్లో ఎంజీఎం వెళ్లనున్న నేపథ్యంలో ఎంజీఎం లేదా, కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తాత్కాలికంగా సీఎంఎస్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంటున్నారు.

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



ఉర్సు సీఎంఎస్ వద్ద ఐరన్ ర్యాంప్‌లో ఇరుక్కుపోయిన ఆటో (ఫైల్)

ఉర్సు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌కు ఇరుకైన రోడ్లపై భారీ వాహనాలు మందులతో వస్తుంటాయి. దాంతో రాకపోకలు కష్టతరంగా మారాయని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఎస్ ప్రహరీ ప్రధాన గేటులోకి వచ్చిన వాహనాలు కిటెల్ గార్డ్(ఐరన్ ర్యాంప్)లో ఇరుక్కుపోతున్నాయి.

లంచం అడిగేవారిని పట్టిస్తే రూ.25వేల గిఫ్ట్

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



అర్హురాలికి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని లంచం అడిగేవారిని నాకు పట్టిస్తే రూ.25వేలు గిఫ్ట్‌గా ఇస్తాను.. అలాగే సదరు వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి పారదర్శకంగా అర్హులకే అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కరికైనా ఇల్లు మంజూరు చేసిందా అని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓర్వడం లేదన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అందులో 660 పత్రాలు ఇచ్చామని, త్వరలో మిగతావి అందజేస్తానని చెప్పారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు 3వ తేదీన ముగ్గుపోసుకుని నిర్మాణాలు ప్రారంభించి దావతు చేసుకుని తనను ఆహ్వానిస్తే ఆనందంగా వస్తానని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించి పంపిణీ చేయకుండా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల పని పడతానని, 15 రోజుల్లో అర్హులకు వాటిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బావుసింగ్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ రజాలీ, తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, దేవ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఒత్తిడి దూరం

- ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ దేవిక



సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ దేవిక

వరంగల్ స్పోర్ట్స్: నిత్యం ఉదయం గంట పాటు సైక్లింగ్ చేయడం వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని జయించవచ్చని హనుమకొండ ఇన్‌చార్జ్ డీవైఎస్‌ఓ దేవిక అన్నారు. అంతర్జాతీయ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతీ ఒక్కరు శారీక వ్యాయామన్ని తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైక్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, వాకర్స్ సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పవన్‌కుమార్, శ్యాంప్రసాద్, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, రమేష్, విష్ణువర్ధన్, అఫ్జల్, శంకర్, వెంకట్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

న్యూశాయంపేట: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న ఆమె.. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు ఇవ్వడానికి రావొద్దని కోరారు.

న్యూస్‌రీల్

పోలీస్ అధికారులకు సేవా పతకాలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న 12 మంది పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఒకరు ఉత్తమ సేవా పతకానికి, 11 మంది పోలీస్ అధికారులు సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదివారం అభినందించారు. ఉత్తమ సేవా పతకానికి హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై ఎ.రఘునారెడ్డి, సేవా పతకానికి ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సీసీఆర్‌బీ ఎస్సై జె.విల్సన్, సుబేదారి ఎస్సై పి.ప్రకాశ్‌రెడ్డి, ఏఆర్‌ఎస్సై ఎండీ.మక్బుల్‌పాషా, ఏఆర్‌ఎస్సై ఎం.రాంధన్, కాజీపేట ఏఎస్సై వి.చంద్రమౌళి, ఏఆర్ ఎస్సై షేక్ పాషా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ.ఖాజానజీముద్దీన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బస్సు భీమయ్య, మామునూరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.రమేశ్, వంగర పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.తిరుపతిగౌడ్ ఎంపికయ్యారు.

9 గేదెలు, ఒక దూడ అపహరణ



నర్సంపేట రూరల్: నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామ శివారులోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన మోతె తిరుపతిరెడ్డికి చెందిన 9 గేదెలు, 1 లేగ దూడను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు నర్సంపేట ఎస్సై అరుణ్ తెలిపారు. గుంటూరుపల్లికి చెందిన మోతె తిరుపతిరెడ్డి గేదెల ఫామ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు 9 గేదెలు, 1 లేగ దూడలు శనివారం రాత్రి దొంగలించారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధితుడు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయొద్దు

విద్యారణ్యపురి: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయొద్దు.. ఇటీవల పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసేలా ఉన్నాయి.. వాటిని వెనక్కి తీసుకోవాలని పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా సర్దుబాటు ఉత్తర్వులు ఉండాలని, అసబంద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలను పాటించడం వల్ల ప్రాథమిక విద్యపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. 'బడిబాట' కార్యక్రమం పూర్తయ్యాకే టీచర్ల సర్దుబాటు చేపట్టాలని ఒక ప్రకటనలో కోరారు.

'బెస్ట్ అవైలబుల్ స్కీం'కు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు 2025–26 విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాకు ఒకటో తరగతి 60 సీట్లు, 5వ తరగతి 62 సీట్లు కేటాయించారని, ఈనెల 16వ తేదీ లోపు అప్లై చేసుకోవాలని, ఇతర వివరాలకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయం, వరంగల్, సహాయ సాంఘిక కార్యాలయం సంక్షేమాధికారి, నర్సంపేటలో సంప్రదించాలని సూచించారు.

ఛత్తీస్‌గఢ్ టు హైదరాబాద్



ఏటూరు నాగారం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ నుంచి ఐరన్ ఓర్ పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలిపోతోంది. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఐరన్ ఓర్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందని, పర్మిషన్ ఉందా లేదా అంటూ ఆరా తీశారు. అయితే డ్రైవర్ సెల్‌ఫోన్‌లో చూపిన ఆధారాలను చూసి విచారించి వదిలేశారు. గతంలోనే మావోయిస్టులు పలు ప్రకటనల్లో ఖనిజ సంపద తరలిపోయే అవకాశాలున్నాయని ప్రకటించారు. కొద్ది రోజులకే ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద ఎత్తున ఐరన్ ఓర్ తరలిపోతుండడం గమనార్హం. ఖనిజ సంపదను తరలించేందుకే మావోయిస్టుల ఏరివేతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందా? అనే అనుమానాలను పలు ప్రజా సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

కాల్‌సెంటర్ ఆకస్మిక తనిఖీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న కాల్‌సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి టోల్‌ఫ్రీ నంబర్‌కు రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఫిర్యాదు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఏయే సమస్యలపై రైతులు ఫిర్యాదు చేశారని ఆరా తీశారు. పరిష్కార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యం కొనుగోలుకు సంబంధించి కాల్‌సెంటర్‌కు గత నెల 21 నుంచి ఆదివారం వరకు మొత్తం 20 ఫిర్యాదులు రాగా.. పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించినట్లు కాల్‌సెంటర్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేసి రిజిస్టర్‌లో నమోదై ఉన్న చెన్నారావుపేట మండలం సూరిపల్లి రైతు చంద్రశేఖర్‌తో, పర్వతగిరి మండల రైతు మధుతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. పరిష్కారమవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు టోల్‌ఫ్రీ నంబర్ 18004253424ను వినియోగించుకోవాలని, ధాన్యం కొనుగోలు, సేకరణ, రవాణా, మద్దతు ధర తదితర సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పచ్చిరొట్ట పదిరెట్లు మేలు

- వికసిత్ సంకల్ప అభియాన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజన్న
- పలు గ్రామాల్లో రైతులకు అవగాహన



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజన్న

దుగ్గొండి: పచ్చిరొట్ట సాగు చేసి భూమిలో కలియదున్నితే పశువుల పేడకంటే పదిరెట్లు ఎక్కువ పోషకాలు అంది భూమి సారవంతం అవుతుందని వికసిత్ సంకల్ప అభియాన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజన్న అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మండలంలోని నాచినపల్లి, రేకంపల్లి, మహ్మదాపురం, మైసంపల్లి, మల్లిపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల్ని సారవంతం చేయడానికి తొలకరి వర్షాలకు జనుము, జీలుగు, పెసరు, పిల్లిపెసర, అలసందలు సాగుచేసి పూత దశలో కలియదున్నితే మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయన్నారు. భూమి నిర్మాణం మెరుగుపడి పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. మంచి ఆరోగ్యం కోసం ప్రతీ రైతు తనకున్న భూమిలో కొంత విస్తీర్ణంలోనయినా చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. పశువైద్యాధికారి శారద మాట్లాడుతూ.. పశువులను రోగాల బారి నుంచి కాపాడుకోవడానికి సమయానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సౌమ్య, కన్నబాబు, హర్ష, ఏఈఓలు విజయ్‌నాయక్, వైజయంతి పాల్గొన్నారు.

'అక్రమంగా కేసు పెట్టారు.. న్యాయం చేయండి'

- రిటైర్డ్ పోలీస్ అధికారికి పోలీసుల వత్తాసు
- ఓ రైతు కుటుంబం ఆరోపణ



మాట్లాడుతున్న రైతు కుటుంబం

గీసుకొండ: తాము స్థానికంగా లేకపోయినా ఓ రిటైర్డ్ పోలీసు అధికారి ఒత్తిడి మేరకు జామాయిల్ చెట్లను కాలబెట్టారని గీసుకొండ పోలీసులు తమపై తప్పుడు కేసులు పెట్టారని సంగెం మండలం కుంటపల్లికి చెందిన రౌతు పూర్ణచందర్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తాను గీసుకొండ మండలం శాయంపేట హవేలి శివారులోని తన 5.30 ఎకరాల భూమిలో మొక్కజొన్నను సాగు చేసినట్లు.. తమ పక్కనే రిటైర్డ్ ఏసీపీ వాసం సురేందర్ భూమి ఉండగా.. అందులో గాదె చంద్రమౌళి అనే రైతు జామాయిల్ సాగు చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తన మొక్కజొన్న చేనుతోపాటు సురేందర్‌కు చెందిన కొన్ని జామాయిల్ చెట్లు కాలిపోయాయని.. ఈఘటన జరిగిన రోజు తాను కేరళ వెళ్లగా.. చంద్రమౌళి ద్వారా సురేందర్ గత నెల 25న తనపై ఫిర్యాదు చేయించి స్థానిక పోలీసుల సహకారంతో కేసు నమోదు చేయించారన్నారు. తన మొక్కజొన్న చేనును కాలబెట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు అవుతున్నా.. కేసు నమోదు చేయడం లేదని పూర్ణచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈవిషయమై గీసుకొండ సీఐ మహేందర్‌ను వివరణ కోరగా.. మొక్కజొన్న చేనుతో పాటు జామాయిల్ తోట కాలిపోయిన విషయమై ఇరువర్గాల వారు ఫిర్యాదు చేయగా.. రైతు పూర్ణచందర్‌పై కేసు నమోదు చేశామని, అతడి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

వేడుకలకు వేళాయె..

- నేటి రాష్ట్ర అవతరణ దినోత్సవానికి సర్వం సిద్ధం
- ఖుష్‌మహల్ ప్రాంగణంలో సంబురాలకు ఏర్పాట్లు
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పనులను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అధికారులు



రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్‌కుమార్



మాక్ పరేడ్ చేస్తున్న స్పెషల్ పోలీసులు



ముస్తాబైన వేదిక ప్రాంగణం

ఖిలా వరంగల్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ ప్రాంగణం సిర్వం సిద్ధమైంది. ఏర్పాట్లను డిప్యూటీ సిటీ పోలీస్ కమిషనర్ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సత్యశారద ఆదివారం సాయంత్రం పరిశీలించారు. వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ సత్యశారద పర్యేవేక్షణలో సర్వాంగ సుందరంగా వేదిక ముస్తాబైంది. ఖుష్‌మహల్, రాతికోట ముఖద్వారం, చారిత్రక కట్టడాలు, ప్రధాన జంక్షన్లు, అమరవీరుల స్తూపం, విద్యుత్ దీపాలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసింది. అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి విద్యుత్ అలంకరణ, నివాళులర్పించేందుకు సదుపాయాలు కల్పించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉత్తమ అధికారులను అభినందించి ప్రశంస పత్రాలను అందజేయనున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, గృహ నిర్మాణాల శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, మున్సిపల్ ఎంహెచ్‌ఓ రాజేశ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బందోబస్తుకు ఏర్పాట్లు

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఆదివారం డిప్యూటీ సిటీ పోలీస్ కమిషనర్ అంకిత్‌కుమార్ వేదిక ప్రాంగణాన్ని పరిశీలించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం స్పెషల్ పోలీసులు చేరుకుని పరేడ్ గ్రౌండ్‌లో కమాండెంట్ పర్యవేక్షణలో మాక్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరామ్‌నాయక్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సుబ్రు, ఎస్సైలు పాల్గొన్నారు.

సర్దుబాటు.. ప్రాథమిక విద్యకు నష్టం

- డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జాన్‌నాయక్

నెక్కొండ: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు అని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ బానోతు జాన్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విడుదల చేసి కలెక్టర్లకు ఆదేశాలివ్వడం దారుణమన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని ఓవైపు బలోపేతం చేస్తామని చెప్పుకొస్తూనే.. మరో వైపు ఉపాధ్యాయల సంఖ్య కుదింపునకు ఉత్తర్వులు జారీ చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. వేసవి కాలంమంతా ఉపాధ్యాయులకు, అధికారులకు శిక్షణతోపాటు బడిబాట పేరు మీద అనేక కార్యక్రమాలు చేపడుతూనే.. విద్యార్థులు తక్కువ ఉన్నారనే సాకుతో ఇలాంటి చర్యలు సరికాదన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ప్రాథమిక విద్యపై పెను ప్రమాదం ఉండనుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు బానోతు బాలాజీ, డి.కుమాస్వామి పాల్గొన్నారు.

రామ్‌కిషన్‌కు సన్మానం

హన్మకొండ: ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా ప్యానెల్ సభ్యుడిగా నియమితుడైన హనుమకొండకు చెందిన డాక్టర్ అజ్మీరా రామ్‌కిషన్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆదివారం సన్మానించారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో ఎంపీ డాక్టర్ కావ్యను అజ్మీరా రామ్‌కిషన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రంగుల లొల్లి.. ఉద్రిక్త వాతావరణం

- అవతరణ దినోత్సవం నేపథ్యంలో అమరవీరుల స్తూపానికి తెల్లరంగు
- వ్యతిరేకించిన బీఆర్‌ఎస్ నాయకులు
- పోలీసుల జోక్యంతో సాఫీగా ఏర్పాట్లు



బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

నర్సంపేట రూరల్: అమరవీరుల స్తూపానికి రంగుల లొల్లితో నర్సంపేట పట్టణంలో ఆదివారం టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు సమస్య ఎటూ తేలకపోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి బీఆర్‌ఎస్ నాయకులకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమనిగింది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో.. నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపానికి గతంలో గులాబీ రంగు ఉండగా.. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెల్ల రంగు వేయించారు. దీంతో.. బీఆర్‌ఎస్ నాయకులు అమరవీరుల స్తూపానికి తెల్ల రంగు ఎలా వేస్తారంటూ.. మళ్లీ గులాబీ రంగు వేశారు. అనంతరం మున్సిపాలిటీ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి వరకు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులు చర్చలు జరిపారు. అధికారిక కార్యక్రమం కావడంతో గులాబీ రంగు కాకుండా తెల్ల రంగు వేస్తున్నారని, దీనికి బీఆర్‌ఎస్ నాయకులు అభ్యంతరాలు చెప్పకూడదని నర్సంపేట టౌన్ సీఐ ఎల్.రఘుపతిరెడ్డి వారికి నచ్చజెప్పారు. అమరవీరుల స్తూపం ఎదుట ఉన్న గద్దెకు మాత్రం రంగు వేయరని తెలపడంతో శాంతించిన బీఆర్‌ఎస్ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సమస్య సద్దుమనిగింది. మధ్యాహ్నం వేసిన గులాబీ రంగు స్థానంలో మళ్లీ అమరవీరుల స్తూపానికి మున్సిపాలిటీ సిబ్బంది తెల్లరంగు వేసి ఆవిర్భావ వేడుకలను యథావిధిగా కొనసాగించనున్నారు.

టీజీ ఎడ్‌సెట్-25 ప్రశాంతం



పరీక్ష తీరును పర్యవేక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

బీఈడీ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం ఉమ్మడి జిల్లా కేంద్రంలోని 9 సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించిన 'టీజీ ఎడ్‌సెట్' పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 83.79 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు.

- వివరాలు 8లో

పాముకాటుతో రైతు మృతి



ఎల్లయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని విశ్వనాథపురంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గుర్రపు ఎల్లయ్య(54) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తన వ్యవసాయ బావి వద్ద పశువులకు మేత వేస్తుండగా పాము కాటు వేసింది. గమనించని ఎల్లయ్య యథావిధిగా ఇంటికి వచ్చాడు. కాలుకు కాటువేసిన చోట స్వల్పంగా రక్తస్రావం అవుతుండగా కట్టె గీసుకుందని భావించాడు. అనంతరం కాస్త నలతగా ఉండటంతో పాము కాటు వేసి ఉంటుందని భావించిన కుటుంబ సభ్యులు ఎల్లయ్యను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా అదేరోజు రాత్రి మృతిచెందాడు.

విద్యుత్ తీగలే యమ పాశాలై..

- తెగిపడిన తీగలు తగిలి వ్యక్తి మృతి
- చెర్లపాలెంలో ఘటన

తొర్రూరు రూరల్ : విద్యుత్ తీగలు యమపాశాలయ్యా యి. రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తొర్రూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన వల్లపు అశోక్ (45) శనివారం జలగం మల్లయ్యతో కలిసి పని నిమిత్తం బైక్‌పై చెర్లపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో చెర్లపాలెం శివారులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడి ఉన్నాయి. చూడకుండా బైక్ నడపడంతో తీగలు వాహనానికి తగిలి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తొర్రూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అశోక్ అదేరోజు రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- రూ.14లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం అపహరణ

ఖిలా వరంగల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి వరంగల్ గాంధీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చాతరాజు రేణుక ఇంటికి తాళం వేసి శనివారం కక్కిరాలపల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఆదివారం ఉదయం ఇంటికి రాగా ఇంటి తాళం తీసి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఎస్సై సురేశ్ క్లూస్ టీమ్‌తో కలిసి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరు పరిశీలించారు. బీరువాలో దాచిపెట్టిన ఐదు న్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.14లక్షల నగదు చోరీకి గురైందని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తవాడలో పదితులాల బంగారం..

రామన్నపేట : వరంగల్ కొత్తవాడలో ఆదివారం సాయంత్రం సక్కుబాయ్ నివాసంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 తులాల వరకు బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సుక్కబాయి హైదరాబాద్ వెళ్లిన విషయాన్ని గమనించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.



పశువుల ఎరువుతో భూసారం

- వేసవి దుక్కులతో మేలు
- అధిక దిగుబడులు సాధించొచ్చు





ట్రాక్టర్‌లో పశువుల ఎరువు నింపుతున్న కూలీలు,ఎడ్లబండిపై పశువుల ఎరువు పొలంలోకి తరలిస్తున్న రైతు


పెద్దవంగర: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోతుండడంతో నేలలోని పోషక నిల్వల్లో సమతుల్యత లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం.. సూక్ష్మ పోషకాల లోపం దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో ఈ సమస్యలు అధికమించాలంటే సేంద్రియ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

వేసవి దుక్కులు దున్నే ముందు..

ఆవులు, గేదెలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతో ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే అద్భుత ఫలితం ఉంటుంది. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడానికి వీలుంటుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతోంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువులఎరువు ఉపయోగపడుతుంది. గ్రామాల్లో ట్రాక్టర్, ఎడ్లబండ్ల సాయంతో ఎరువులను పొలాల్లోకి చేరుస్తున్నారు.

భూసారం పదిలం..

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా పశువుల ఎరువును పొలంలో చల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. అందుకే పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీంతో భూసారం పెరుగుతుంది. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందేలా తోడ్పాటునిస్తుంది.



19,600 ఎకరాల్లో సాగు భూమి..

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సుమారు ఈ ఏడాది 19,600 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలు వంటి పశువుల ఎరువునే తమ పొలాలకు వాడుతున్నారు.

భూసారం పెరుగుతుంది



పశువుల ఎరువుతో భూసారం పెరుగుతుంది. సహజ సిద్ధ పోషకాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణం అదుపు చేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సాయపడుతుంది. రైతులు పశువుల ఎరువుతో అధిక దిగుబడులు పొందొచ్చు. వీటితో పండించి పంటను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం.

గుగులోత్ స్వామి నాయక్, ఏఓ, పెద్దవంగర

టీజీ ఎడ్‌సెట్–25 ప్రశాంతం

రెండు సెషన్లలో కలిపి 83.79శాతం హాజరు



టీజీ ఎడ్‌సెట్ సెట్–ఎ ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, వీసీ కె.ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశానికి ఆదివారం కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఆన్‌లైన్ కంప్యూటర్ సిస్టం ద్వారా నిర్వహించిన 'టీజీ ఎడ్‌సెట్' ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని 9 సెంటర్లలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్ పరీక్షకు 2,190 మంది విద్యార్థులకు 1,821 మంది(83.15శాతం), మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షకు 2,110 మందికి 1782 మంది(84.45శాతం) హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 4,300 మంది విద్యార్థులకు 3,603 మంది (83.79శాతం) హాజరైనట్లు టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.

ప్రశ్నపత్రాల సెట్‌ల ఎంపిక

కేయూలోని ఎడ్‌సెట్ కార్యాలయంలో ఉదయం సెషన్ సెట్–ఎ ప్రశ్న పత్రాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, రెండో సెషన్ సెట్–బి ప్రశ్న పత్రాన్ని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి ఎంపిక చేశారు. ఎంపిక కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఇ.పురుషోత్తమ్, ఆచార్య మొహమ్మద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్, కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, విద్యావిభాగం డీన్ రాంనాథ్‌కిషన్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్, పాలకమండలి సభ్యులు బి.సురేష్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన చైర్మన్, వీసీ

ఉమ్మడి జిల్లా కేంద్రంలోని మోక్షిత ఇన్‌స్టిట్యూట్, బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ, హనుమకొండలోని ఆయాన్ డిజిటల్, నోబెల్ ఇన్‌స్టిట్యూట్ తదితర పరీక్ష కేంద్రాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి పరిశీలించారు.

ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌ఈఈయూ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్‌ఈఈయూ కార్యాలయంలో ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.. శ్రీధర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను రెండు రోజుల్లో కలిసి ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతానన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నాలుగు విద్యుత్ కంపెనీలలో ఆర్టిజన్‌లతో కలిసి ధర్నాలు నిర్వహించడానికి కూడా వెనకాడబోమన్నారు. ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తులసి శ్రీమతి, టీఎస్‌ఈఈయూ ఎన్పీడీసీఎల్ యూనిట్ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మచ్చిక బుచ్చయ్య గౌడ్, భువనగిరి సెక్రటరీ ఆర్.సి.రెడ్డి, ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం నాయకులు సికిందర్, యుగంధర్, వెంకటేశ్వర్లు, సతీశ్, నరేందర్ రెడ్డి, బాబాన్న, సతీశ్ రెడ్డి , సలీం పాషా, శ్రీనివాసరెడ్డి, రవీందర్, సతీశ్ పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



సారంగపాణి (ఫైల్)

సంగెం: ఒంటరితనం భరించలేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లపెల్లి సుశీల, సారంగపాణి(70) దంపతులకు శారద, కుమారస్వామి, రాజు సంతానం. చిన్నతనంలో కుమారుడు కుమారస్వామి చనిపోయాడు. తర్వాత భార్య సుశీల మరణించింది. అనంతరం రేణుకను మరో పెళ్లి చేసుకున్నాడు. కూతురు శారద, చిన్న కుమారుడు రాజు వివాహాలు జరిపించారు. కొంతకాలం తర్వాత కూతురు శారద మరణించింది. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం రెండో భార్య రేణుక సారంగపాణిని వదిలివెళ్లింది. దీంతో కొంత కాలంగా సారంగపాణి చనిపోయిన భార్య సుశీల, కుమారుడు కుమారస్వామి, కూతురు శారదను తలుచుకుంటూ ఒంటరితనంతో మనస్తాపం చెందుతున్నారు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత రాజు కుటుంబసభ్యులు ఒకగదిలో సారంగాపాణి మరోగదిలో నిద్రించారు. ఉదయం లేచిన తర్వాత మనవడు వినయ్.. సారంగపాణి గదిలో చూడగా దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని మనస్తాపంతోయువకుడు ..

ఎల్కతుర్తి: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నెట్టెం సతీశ్(30) పెళ్లి కావడం లేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న కుటుంబీకులకు చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో తల్లి మంజుల ఫోన్ చేయగా పొలం వద్ద గడ్డి మందు తాగానని చెప్పాడు. దీంతో హుటాహుటిన పొలం వద్దకు చేరుకుని సతీశ్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ, కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

జనగామ : జనగామలోని మెడికల్ కళాశాల సమీపంలో కారు, లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని పెద్దపహాడ్ గ్రామానికి చెందిన షాబీర్, జహంగీర్ పట్టణంలోని గోల్డ్ షాప్‌లో పని చేస్తున్నారు. పనులు ముగించుకొని సొంత కారులో ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జనగామ వైపు వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కారు ఎగిరి పల్టీ కొట్టింది. అందులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా 108 లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై ఫిర్యాదు

సంగెం: కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన చెల్కలపల్లి పైడయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కులానికి చెందిన పెద్ద మనుషులు చెల్కలపల్లి నాగరాజు, నీరటి రమేశ్ తమ కుటుంబంపై కక్ష కట్టి రెండేళ్ల నుంచి కులానికి సంబంధించిన వారిని తమ ఇంటికి రానివ్వడం లేదని, తమ కుటుంబాన్ని కులంలోని వారి ఇళ్లకు పిలిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తామని కులకట్టడి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మే 30వ తేదీన సంప్రదాయం ప్రకారం.. ముదిరాజ్ కులస్తుల కథలు చెప్పి డబ్బులు తీసుకునే కాటిపడగల వారు తమ గ్రామానికి వచ్చారని, వారికి కులంలోని వారు ఒక్కొక్కరికి రూ.400 చొప్పున ఇవ్వాలని చెరువు వద్ద పెద్ద మనిషి నాగరాజు చెప్పాడని.. అందుకు పైడయ్యతో పాటు ఇద్దరు కొడుకుల డబ్బులు రూ.1,200 ఇవ్వడానికి వెళ్లితే మిమ్మల్ని కులం నుంచి తీసేశామని డబ్బులు తీసుకోమని.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని కులపెద్దలు తిరస్కరించారన్నారు. మూడేళ్ల క్రితం చెరువు వద్ద చేపలు పట్టే విషయంలో ఎల్గూరురంగంపేట సొసైటీ కార్యవర్గ సభ్యుల ఎదుట తన కుమారుడు కిరణ్‌పై కర్రలతో దాసి చంపుతామని బెదిరించగా.. అప్పుడు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని.. అప్పటి నుంచి తమ ఇంట్లో శుభకార్యాలకు వారు రాకుండా, వారిళ్లలోని శుభకార్యాలకు తమను పిలవకుండా అవమానిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. విచారణ చేసి కులకట్టడి చేసిన వారిపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పైడయ్య తెలిపారు. ఈవిషయంపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా.. పిటిషన్ వచ్చిందని విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక సాంద్రత సాగు.. లాభాలు బాగు

- ఎకరాకు 25 నుంచి 30 వేల పత్తి విత్తనాలు నాటొచ్చు
- సాధారణ పద్ధతిలో ఎకరాకు 7 వేలే..
- ఎకరాకు 15- 20 క్వింటాళ్ల దిగుబడి



నాగభూషణం వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త



అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట(ఫైల్)

దుగ్గొండి: తెల్లబంగారంపై మక్కువతో అన్నదాతలు అనదిగా పత్తి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో రోజురోజుకూ పెట్టుబడి వ్యయం పెరగడం.. నానాటికీ దిగుబడి తగ్గడం.. దిగుబడికి వచ్చినా సరైన ధర లేక పోవడంతో పత్తి పంటపై అన్నదాతలకు ఆసక్తి తగ్గిపోతుంది. అయితే ఈ తరుణంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి అధిక దిగుబడులు సాధించొచ్చని వరంగల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త యు. నాగభూషణం తెలిపారు. రోహిణి కార్తె మొదలు కావడం, రుతుపవనాలు విస్తరించడంతో రైతులు పత్తి పంట సాగు ప్రారంభించారు. మూస పద్ధతికి స్వస్తి పలికి నూతనంగా సాగు చేయాలని ఆయన తెలిపారు. సాధారణంగా రైతులు హచ్చు పద్ధతిలో పత్తి పంట సాగు చేస్తున్నారు. సాలుకు సాలుకు మధ్య 100 సెంటీమీటర్లు, మొక్కమొక్కకు మధ్య 100 సెంటీమీటర్ల దూరంతో విత్తనాలు నాటుతున్నారు. ఇలా సాగు చేయడం వల్ల ఎకరా భూమిలో 6 నుంచి 7 వేల మొక్కలు మాత్రమే వస్తున్నాయి. ఈ పద్ధతిలో సాగుతో పత్తి మూడు దఫాలుగా తీయాల్సి వస్తోంది. కూలీల భారం పెరుగుతుంది. పంట కాలం పెరుగుతుంది. రెండో పంట వేసుకునే అవకాశం రావడం లేదు. దిగుబడి ఏటికి ఏడు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల లో గతేడాది ఎకరాకు 6 క్వింటాళ్లకు మించి రాలేదు.

అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు 30 వేల మొక్కలు..

అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసే క్రమంలో సాలుకు సాలుకు మధ్య 80 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్ల దూరంతో విత్తాలి. ఎకరాకు 4 పత్తి గింజల ప్యాకెట్లు అంటే సుమారు 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఇలా సాగు చేయడం వల్ల ఎకరా భూమిలో 25 నుంచి 30 వేల మొక్కలు వస్తాయి. పత్తి 40 రోజుల వయసులో, 70 రోజుల వయసులో చమత్కార్ మందును పిచికారీ చేయాలి. చమత్కార్ మందు పిచికారి వల్ల చేనంతా ఒకేసారి కాపునకు వస్తుంది. కాయలన్నీ ఒకేసారి కాస్తాయి. దూది సమయంలో కేవలం ఒకసారి మాత్రమే తీసుకోవచ్చు అనంతరం మళ్లీ రెండో పంటగా మొక్కజొన్న, వేరుశనగ,



అధిక సాంద్రత పద్ధతిలో పత్తి విత్తనాలు నాటిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

కూరగాయ పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎరువులు వేయడం, సస్యరక్షణ అంతా సాధారణ పద్ధతిలోనే చేసుకోవాలి. ఇలా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో ధర కొంతమేర తక్కువ ఉన్నా ఆశించిన మేర నికర ఆదాయం ఉండి రైతు లాభాలు పొందుతాడు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం 'మాయం'

- వరుసగా రెండోసారి ఘటన
- పట్టించుకోని కేంద్రం నిర్వాహకులు



వివరాలు వెల్లడిస్తున్న బాధిత రైతులు

చిన్నగూడూరు: రైతులు ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలవుతుంది. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరుసగా రెండోసారి ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. బాధిత రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన బాధిత రైతులు నామ సునీతరాజు, కోల లచ్చమ్మ శ్రీను కథనం ప్రకారం.. గత నెల 9న సునీతకు చెందిన 84 బస్తాలు(33 క్వింటాళ్ల 60 కేజీలు), లచ్చమ్మకు చెందిన 38 బస్తాలు(15 క్వింటాళ్ల 20 కేజీలు) మొత్తం 122 బస్తాలు ధాన్యం కాంటా వేవారు. మరుసటి రోజు ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించారు. వే బ్రిడ్జి కాంటా అయిన మరో పది రోజులకు 110 బస్తాలకు కాంటా అయినట్లు ఫోన్‌కు ఓటీపీ వచ్చిందని మరిపెడ చారి అనే వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో రైతులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. 122 బస్తాలకు 110 బస్తాలు కాంటా అయితే మిగతా 12 బస్తాల ధాన్యం ఏమైందంటూ కొనుగోలు కేంద్రం నిర్వహకులను ప్రశ్నించగా వారు పట్టించుకోలేదు. దీంతో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామని బాధిత రైతులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

- ఏబీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి
- గౌడ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేత

కాజీపేట అర్బన్ : విద్యార్థులు సెల్‌ఫోన్లు వీడి, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని సాధించేందుకు కృషి చేయాలని ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం హంటర్‌రోడ్డులోని గౌడ హాస్టల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాల అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోపా ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డులు నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదువుతున్న విద్యార్థులను ఉత్తేజపరిచేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గోపా అధ్యక్షులు చిర్రరాజుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, రాష్ట్ర గోపా మాజీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.శ్రీనివాస్‌గౌడ్, గౌడ ప్రతిభా పురస్కార్ కార్యక్రమ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు పెద్ది వెంకట్‌నారాయణగౌడ్, బూర విద్యాసాగర్‌గౌడ్, తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్, బోనగాని యాదగిరిగౌడ్, ఏసీపీ నాగయ్యగౌడ్, మార్క విజయ్‌గౌడ్, పోగాకు అశోక్ గౌడ్, సురేశ్, కుమారస్వామి, బత్తిని రమేశ్, అంబాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలబాలికల జీవితాల్లో వెలుగులు

- బాలవికాస మహిళాభివృద్ధి సీనియర్ మేనేజర్ లత



మాట్లాడుతున్న సీనియర్ మేనేజర్ లత

కాజీపేట రూరల్ : సమాజంలో బాల వికాస సంస్థ అనాథ (వికాస) బాలబాలికల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ మహిళాభివృద్ధి పథక సీనియర్ మేనేజర్ డి.లత అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాల వికాస సంస్థలో ఆదివారం రూ.9 లక్షలతో 273 మంది అనాథ (వికాస) బాల బాలికలకు నూతన విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుంచి పీజీ వరకు 9 జిల్లాల వారికి అవసరమైన విద్యాసామగ్రితోపాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలవికాస అనాథ బాలబాలికలకు చేయూతనిస్తూ వారికి అన్ని విధాలా తోడ్పటు నందిస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోందన్నారు. బాలవికాస తెలుగు రాష్ట్రాల్లో మహిళాభివృద్ధి పథకంలో భాగంగా 1,600 మంది అనాథ బాలబాలికలకు చేయూతనిచ్చిందన్నారు. జనవికాస ప్రెసిడెంట్ లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితంలో విద్య అత్యంత విలువైందన్నారు. బాలవికాస బాలబాలికల విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి పథక నుంచి సుజాత, జ్యోతి, అమూల్య, ఐటీ మేనేజర్ శివరాం, తదితరులు పాల్గొన్నారు.



బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు: మండల పరిధి చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం పైనుంచి వరద నీరు జాలువారుతుండడంతో ఆ అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడతోపాటు విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో సూదూర ప్రాంతాల నుంచి బొగత జలపాతం అందాలను తిలకించి సేదదీరేందుకు భారీగా తరలొచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- 3BHK ఫ్యామిలీ ఫోర్షన్ FCI కాలనీ రోడ్ No.2, H.No.35-3-75, గోపాలపురం, హన్మకొండ. సెల్: 9866549297, 8712309298. [SCA25004457]

FLAT FOR SALE

- 3BHK FLAT, 1st ఫ్లోర్, 1478 Sft అక్షర స్కూల్ ప్రక్కన, భవాని నగర్ (డీజిల్ కాలని) కాజీపేట Hyd రోడ్డకి అతి సమీపంలో FLAT అమ్మకానికి కలదు. సం.ప్ర. 80554 54805 [M-13536]

SERVICES

సిరి అసోసియేట్స్

- హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల & గూన పెంకు ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25003998]

BUSINESS OFFER

- Need Monthly Returns? Get International Capital Market Trading, Profit Sharing/Fixed Profit Safe & Secure. Ph : 9392151984 [SCA25004324]

WANTED

- Wanted telecallers in Education sector, Salary 10,000/-. Full Time & Part Time, 5,000/- Incentive are 10,000/- per Admission. Cont: 9908432153 & 9517961999 [WA-6590]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ. 260/- అదనపు లైను రూ. 60/- మాత్రమే 5% GST అదనము

- Wanted 10 security Guards for reputed company. For more details Con: Aptivine Vertex Con.pvt ltd, Ph:95336 80353, 94412 39257 [M 13526]

WANTED TEACHERS

- For All subjects Salary: 10K to 15k for High School 15K to 20k Send your resumes through Whatsapp. Cell: 7995850051, Shantiniketan High School, Durgeshwaraswamy Temple Lane, Warangal [WA-17674]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.